ప్రజాశక్తి
శనివారం 16 నవంబర్ 2024 5 అనంతపురం





బుక్కరాయసముద్రంలో నేలకొరిగిన వరిపంట

580 హెక్టార్లలో పంట నష్టం

చేతికొచ్చిన పంటలు నేలపాలు

ప్రజాశక్తి -అనంతపురం

జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంటలు నేలవాలడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి, మొక్కజొన్న, జొన్న పంటలు దెబ్బ తిన్నాయి. మొక్కజొన్న కోత దశలో ఉన్న సమయంలో పంట నష్టం జరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా ఏడు మండలాలలో 580 హెక్టార్లలో ప్రాథమికంగా పంట నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ శుక్రవారం తెలిపారు. నష్టం విలువ రూ.2.95 కోట్ల వరకు ఉంటుందన్నారు. పుట్లూరు, యల్లనూరు, నార్పల, బుక్కరాయసముద్రం, అనంతపురం, రాయదుర్గం, గార్లదిన్నె మండలాల్లో ప్రాథమికంగా పంట నష్టం వాటిల్లిందన్నారు.







చేనేత కార్మికుని అద్భుత ప్రతిభతో పట్టుచీరకు ప్రపంచ స్థాయి గుర్తింపు లభించింది. హ్యాండ్లూమ్ మగ్గంపై కార్మికుడు తయారు చేసిన చీర మగువకు మణిహారంగా నిలిచింది. పోగుపోగూ పేర్చి అందమైన హరివిల్లులాంటి చీరను తయారు చేసిన నేతన్న ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోయాడు. ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యంతో ఈ రంగం రానురానూ తిరోగమనంలో పడింది. వృత్తిలో ఆదాయం లేక కార్మికులు ఉపాధికి దూరం అయ్యే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో లక్షల్లో ఉన్న మగ్గాలు రానురానూ వేలల్లోకి, వేలల్లో ఉన్నవి వందల్లోకి చేరే పరిస్థితి వచ్చింది. చేనేతల అభివృద్ధి గురించి నిత్యం మాటలు వల్లేవేసే పాలకులు ఆచరణలోకి వచ్చే సరిగా నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లోనూ నేతన్నకు మరోసారి నిరాశే ఎదురయ్యింది. బడ్జెట్ కేటాయింపులు చూస్తే ప్రభుత్వం ఈ రంగాన్ని కనీసం పరిగణలోకి కూడా తీసుకున్నట్లు కన్పించడం లేదంటూ కార్మికులు నిట్టూరుస్తున్నారు.

- బడ్జెట్‌లో నిధులు అతి స్వల్పం
- ఎన్నికల హామీలపై ప్రస్తావనే లేదు..
- సందిగ్ధంలో ముడిపట్టు సబ్సిడీ.. నేతన్న నేస్తం..!
- కూటమి తొలి బడ్జెట్‌పై నేతన్నల పెదవివిరుపు

చే'నేత'కు నిరాశ..!

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురంలో జిల్లాలో చేతివృత్తుల పనులు చేసుకుని జీవించే వారిలో చేనేత కార్మికులే అధికం. ధర్మవరం, హిందూపురం, ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి, ఉరవకొండ, సిండికేట్ నగర్, యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, చెన్నేకొత్తపల్లి, గోరంట్ల, నల్లమాడ, నల్లచెరువు తదితర మండలాల్లో చేనేత కార్మికులు జీవనం సాగిస్తున్నారు. ఈ వృత్తిపై దాదాపు లక్ష కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. గతంలో వీరి సంఖ్య 1.50 లక్షలు ఉండేది. పాలకుల నిర్లక్ష్యంతో రానురాను చేనేత వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయింది. ముఖ్యంగా ముడిసరుకుల ధరలు పెరగుదల, పవర్‌లూమ్స్, ప్రభుత్వ నిరాదరణ, చీరలకు గిట్టుబాటు ధరల లేకపోవడం తదితర కారణాలతో చేనేత రంగం కుదేలేంది.

బడ్జెట్‌లో మొండిచేయి

కూటమి ప్రభుత్వం ఇటీవల శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ చేనేత వర్గాలను తీవ్ర నిరాశకు గురి చేసినట్లు తెలుస్తోంది. దశాబ్ధ కాలంగా చేనేత పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో చేతినిండా పనిలేక నేతన్నలు ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న రుణభారంతో వృత్తికి దూరం అవుతున్నారు. అప్పులను తీర్చలేక చాలా మంది ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో చేనేతలకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను బడ్జెట్‌లో అమలు చేసేలా కేటాయింపులు ఉంటాయని నేతన్నలు ఆశించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబు నాయుడు ఉమ్మడి జిల్లాలో పర్యటించిన సందర్భంగా చేనేతలు ఉన్న ప్రతి ప్రాంతంలోనూ వారికి అనేక హామీలు ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం చేనేతను పూర్తిగా విస్మరించిందని తాము అధికారంలోకి వస్తే ఆదుకుంటామని చెప్పారు. ఈ హామీలపై నమ్మకంతో గత ఎన్నికల్లో చేనేతలందరూ కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక 2024-25 బడ్జెట్‌ను చూస్తే ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు పొంతన లేకుండా ఉంది. నూలు సబ్సిడీ, స్థానిక మార్కెట్ అవకాశాలు పెంపొందించుకునేందుకు వినియోగదారులకు వస్త్ర కొనుగోలుపై ఇచ్చే 20 శాతం రిబేట్ ఊసేలేదు. ముడిపట్టు రాయితీ, నేతన్న నేస్తం, చేనేత కార్మికులకు గృహాలు, ఉచిత వైద్యం, జీఎస్టీ ఉపశమనం తదితర వాటి గురించి నామమాత్రపు ప్రస్తావన కూడా లేదు. ఇటీవల విజయవాడలో జరిగిన చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు చేనేతల ఆరోగ్య భద్రతను తన బాధ్యతగా స్వీకరిస్తున్నానని చెప్పి హెల్త్ ఇన్సూరెన్స్ పథకం అమలుకు రూ.10 కోట్లు ప్రకటించారు. సోమవారం నాడు ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎక్కడా ఆ పథకం అమలుకు సంబంధించి నిధుల కేటాయింపులు జరగలేదు. చేనేతలకు పెనుభారంగా ఉన్న జీఎస్టీ రద్దు చేయించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, అందుకు అవసరమైన చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని, కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోతే రాష్ట్రంలోని చేనేతలు చెల్లిస్తున్న జీఎస్టీ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. దీనిపై కూడా కూటమి ప్రభుత్వం ఎలాంటి స్పష్టతనూ ఇవ్వలేదు. ఇవి కాకుండా చేనేతలకు సొంతిళ్లు, ముడిపట్టు రాయితీ, బ్యాంకు రుణాలు, హెల్త్‌కార్డులు, నేతన్న నేస్తం, చేనేత అనుబంధ రంగాల కార్మికుల సంక్షేమం తదితర దేని మీద బడ్జెట్‌లో ప్రస్తావన చేయలేదు. మొత్తం పరిశ్రమలు, వాణిజ్య శాఖ బడ్జెట్ రూ.4371.42 కోట్లు కాగా అందులో చేనేతలకు కేటాయించింది కేవలం 4.42 శాతం అంటే రూ.193.19 కోట్లు. రాష్ట్ర బడ్జెట్ మొత్తం రూ.2,94,427.25 కోట్లు అంచనా కాగా, చేనేతలకు కేవలం 0.066 శాతం మాత్రమే కేటాయింపులు చేయడంపై చేనేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ముగ్గురు మంత్రులున్నా...

ఈ సారి బడ్జెట్‌లో చేనేతకు కేటాయింపులు ఆశాజనకంగా ఉంటాయని భావించడానికి ప్రత్యేక కారణం ఉంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రులూ ప్రత్యక్షంగా చేనేత కార్మికులతో సంబంధం ఉన్నా వారే కావడం విశేషం. బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఇక రాష్ట్రంలోనే అత్యధిక మంది చేనేత కార్మికులున్న ధర్మవరం నియోజకవర్గం నుంచి ఎన్నికైన సత్యకుమార్ యాదవ్ ముగ్గురు మంత్రులూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వారే. ముగ్గురు మంత్రులూ చేనేతతో అనుబంధం ఉన్న వారే అయినా ఆ రంగానికి బడ్జెట్‌లో నిధులు తక్కువగా రావడంపై నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.







చేనేతకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

ప్రస్తుతం చేనేత పరిస్థితి దయనీయంగా ఉంది. వృత్తిని నమ్ముకుని ఏళ్ల తరబడి జీవనం సాగిస్తున్నా అందులో ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నాం. కనీసం రోజు కూలి దక్కని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఆదుకుంటేనే చేనేత కార్మికుల జీవనం ముందుకు సాగుతుంది. కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతను నిరాశకు గురిచేసింది. నామమాత్రపు కేటాయింపులు కూడా చేయలేదు. ఇచ్చిన కొద్దిపాటి నిధులు కూడా కార్మికునికి చేరే పరిస్థితి లేదు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవర్చేందుకు చేనేతకు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలి.

రామచంద్ర, చేనేత కార్మికుడు, ధర్మవరం.

మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాలు

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నివారణపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్‌లు సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్‌సిఒఆర్‌డి(నార్కో కోఆర్డినేషన్ సెంటర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా గట్టి నిఘా చర్యలు తీసుకోవాలన్నారు. కళాశాలల్లో నందు ప్రహరీ క్లబ్‌లు ఫెయిల్ అయ్యాయని, వాటికి సంబంధించిన జాబితాను ఎస్పీ నుంచి తీసుకుని విచారణ చేసి వారిపై తగు చర్యలు తీసుకోవాలని డివిఈవోను ఆదేశించారు. త్వరలో నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌లో డ్రగ్స్ వల్ల కలిగే దుష్ఫలితాలను తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. పిల్లలకు పుస్తక పఠనం, యోగ, క్రీడలు, తదితర అంశాలపై మక్కువ పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతపురంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పూర్తి స్థాయి డి-అడిక్షన్ వార్డుకు సంబంధించి నిధుల కొరత ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నియంత్రణకు జిల్లా పోలీసు యంత్రాంగం గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై జిల్లాలో పాఠశాలు, కళాశాలలు, గ్రామాల్లో వివిధ రకాల ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆర్డీవో వసంత బాబు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥వెంకటేశ్వరరావు, హార్టికల్చర్ డిడి నరసింహారావు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, డిటిసి వీర్రాజు, డిఎంహెచ్ఓ డా॥ఈబి.దేవి, డివిఈవో వెంకటరమణ నాయక్, బిసి వెల్ఫేర్ డిడి కుష్బు కొఠారి తదితరులు పాల్గొన్నారు.

18న విజయవాడలో ధర్నా : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ విజయవాడ లో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ధర్నా పోస్టర్లను ఆవిష్క రించారు. బంగి శివ మాట్లాడుతూ వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నం భోజన పథకం, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు, మెస్ బిల్లుల పెంపు, జీవో-77 రద్దు, తల్లికి వందనం, యూనివర్సిటీలో ఖాళీ అధ్యాపక పోస్టుల భర్తీ, డిగ్రీలో నాలుగేళ్ల విధానం రద్దు, తదితర డిమాండ్ల సాధనలో భాగంగా మహాధర్నాకు పిలుపునిచ్చామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హారిక, మేఘన, రజిని, కావ్య, వలి, గౌతమ్, అరవింద్, జీవన్, గణేష్ పాల్గొన్నారు.



మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఉపాధ్యాయ సమస్యలపై డిఇఒకు వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ ప్రసాద్‌బాబుకు విన్నవించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు గోవిందరావు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, గౌరవాధ్యక్షులు రమణయ్య, కార్యదర్శి రవికుమార్, గుమ్మగట్ట మండల శాఖ అధ్యక్షులు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు నాగేంద్ర, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు శుక్రవారం డిఇఒ కార్యాలయంలో డిఇఒను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ గుమ్మఘట్ట మండలంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలిం గ్‌లో నిబంధనలను ధిక్కరించి చేసిన డిప్యుటేషన్లను రద్దు చేయాలని, డిస్టెన్స్ బిఈడి చేస్తున్న వారికి చివరి గంటలో బ్లాక్ టీచింగ్ చేసుకునేలా ఉత్తర్వులివ్వాలని కోరగా డిఇఒ సానుకూలంగా స్పందించి నట్లు వారు తెలిపారు.

కళ్యాణదుర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా రాంభూపాల్‌రెడ్డి



ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా కంబదూరు మండలంలోని వెంకటంపల్లి గ్రామానికి చెందిన రాంబూపాల్‌రెడ్డిని ఆ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డి నియమించారు. రాంభూపాల్‌రెడ్డి నియామకంపై నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కష్టకాలంలో పార్టీని నడిపిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న రాంభూపాల్‌రెడ్డి సేవలను అధిష్టానం గుర్తించి సమన్వయకర్తగా ప్రకటించడం హర్షణీయం అని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

డి.హౌన్నూరులో ఇళ్ల ముందు మురుగు

ప్రజాశక్తి-బొమ్మనహాల్



వీధిలో నిలిచిన మురుగు నీరు

మండలంలోని డి.హౌన్నూరు గ్రామంలో వీధుల్లో సీసీ రోడ్లు వేశారు కానీ డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఇళ్లలోని మురుగు నీరు వెళ్లడానికి మార్గం లేక వీధుల్లోనే నిలిచి చిన్నపాటి నీటి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో తీవ్ర దర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్, తదితర చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వీధుల్లో డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ దాస్, నాయకులను వివరణ కోరగా త్వరలో డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తేలికపాటి వానలకే 'అనంత' జలమయం

చినుకుపడితే నగరవాసులకు తప్పని ఇక్కట్లు - అండర్ డ్రెయినేజీ హామీలకే పరిమితం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనంతపురం నగరంలో జలమయం అయిన ప్రధాన రహదారులు

తేలికపాటి వర్షం పడితే చాలు జిల్లా కేంద్రమైన అనంతపురం నగరం మొత్తం జలమయంగా మారుతుంది. రోడ్లపైకి మురుగు, వాననీళ్లు కలసి మడుగులుగా మారుతూ ఉంటాయి. రెండు, మూడు గంటల పాటు నగరవాసులకు ఇక్కట్లు తప్పవు. నగరాన్ని సుందర నగరంగా మారుస్తామని ఎన్నికల సమయంలో హామీలివ్వడానికే సరిపోతోంది. కనీసం మురుగునీటి వ్యవస్థను చక్కబెట్టే వ్యవస్థ ఏదీ ఇప్పటికీ నగరంలో తయారవ్వలేదు. ఎన్నికల సమయంలో నేతల హామీలు వాన నీటి మూటలే అవుతున్నాయి.

చిన్న వానపడినా తప్పని తిప్పలు

అనంతపురం నగరంలో రెండు రోజులుగా తేలికపాటి వర్షం పడుతోంది. గురువారం నాడు 23 మిల్లీమీటర్ల వర్షపాతం పడింది. ఈ పాటి వర్షానికే అంబేద్కర్ బ్రిడ్జి సమీపంలోని సర్కిల్‌లో మోకాళ్ల లోతు వరకు నీరొచ్చి చేరింది. మాజీ ఎంపి సైపుల్లా ఇంటి వద్ద కార్లు నీట మునిగాయి. మరోవైపు రుద్రంపేట బైపాస్ నుంచి బ్రిడ్జి వరకు మురుగునీరు, వాననీళ్ల కలసగలసి రోడ్లపైకి వచ్చింది. ఇక సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్‌లోనూ నీటి మయంగా మారింది. గుల్జార్‌పేట కన్యాకాపరమేశ్వరి దేవాలయం సమీపంలోనూ చిన్న వానపడినా నీరు నిలువ ఉండిపోతోంది. ఆర్టీసీ బస్టాండు సైతం స్విమ్మింగు పూల్‌ను తలపిస్తూ ఉంటుంది. ఇలా నగరంలోని ప్రధాన కేంద్రాలన్నింటిలోనూ ఇదే పరిస్థితి ఉంటోంది.

ఎన్నికల హామీగానే అండర్ డ్రెయినేజీ

ఎన్నికలొచ్చిన ప్రతి సందర్భంలోనూ నగరంలో అండర్ డ్రెయినేజీ వ్యవస్థను తీసుకొస్తామని హామీలు వినపడుతూ ఉంటాయి. దీని వలన నగరంలో మురుగునీటి వ్యవస్థను మెరుగు పరుస్తామన్న చెబుతుంటారు. 2009 ఎన్నికల సమయం నుంచి ప్రస్తుతం జరిగిన 2024 ఎన్నికల వరకు ప్రతి ఎన్నికలో ఇదే హామీ అనంతపురం అసెంబ్లి ఎన్నికల్లో పోటీ చేసిన నేతలు ఇచ్చారు. ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. గతంలో రూ.500కోట్లతో ప్రతిపాదనలను కూడా కేంద్రానికి పంపారు. అయితే వాటిని తీసుకొచ్చే ప్రయత్నాలు మాత్రం ఇప్పటికీ జరగలేదు.

పడుతున్న జడివాన

జిల్లాలో రెండు రోజులుగా జడివాన పడుతూనే ఉంది. తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షపాతం పడుతోంది. 31 మండలాల్లోనూ వర్షపాతం నమోదయింది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఒక్క రోజే 11.8 మిల్లీమీటర్లు పడింది. ఇందులో మండలావారీగా చూసినప్పుడు అత్యధికంగా పుట్లూరులో 27.2, యల్లనూరు మండలంలో 24.8, అనంతపురంలో 23.2, శింగనమలలో 21.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. తక్కిన మండలాల్లోనూ నామ మాత్రంగా వానలు పడ్డాయి.

వీధి కుక్కలకు టీకా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

వీధి కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేయించాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం పురపాలక సంఘం పరిధిలో 58 వీధి కుక్కలకు ఎఆర్‌వి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అలీఖాన్, వెటర్నరీ డాక్టర్ డా. నాగలింగేశ్వరరెడ్డి, పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీ కిష్టప్ప, లైవ్ స్టాక్ అసిస్టెంట్ రామ్మూర్తి పాల్గొన్నారు.

దురదకుంటలో హాకీ పోటీలు

కళ్యాణదుర్గం రూరల్ : మండలంలోని దురదకుంట గ్రామ జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం ఆర్డీటీ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం, దురదకుంట హాకీ జట్ల మధ్య పోటీలు నిర్వహించారు. అండర్-14 బాలుర విభాగంలో కళ్యాణదుర్గం జట్టు 3-2, అండర్-12 బాలుర విభాగంలో కళ్యాణదుర్గం జట్టు 4-0 తేడాతో గెలిచింది. అండర్-14 బాలికల విభాగంలో దురుదకుంట 1-0 తేడాతో కళ్యాణదుర్గం జట్టుపై మీద గెలిచింది. ఈ మ్యాచ్‌లను ఆర్డీటీ హాకీ కోచ్ శంకర్, దురదకుంట స్కూల్ యజమాన్యం, పిడి రాజేంద్ర, కళ్యాణదుర్గం హాకీ కోచ్ అక్రమ్‌బాషా పర్యవేక్షించారు.

గజగౌరీ ఉత్సవాలు ప్రారంభం

బొమ్మనహాల్ : మండల కేంద్రమైన బొమ్మనహాల్‌తోపాటు ఉంతకల్లు, ఉద్దేహాల్, కొలగానహల్లి, శ్రీధరఘట్ట, సింగేపల్లి, అరేసముద్రం, కురువల్లి, నేమకల్లు, గోనేహాల్, కృష్ణాపురం, బండూరు గ్రామాల్లో గజగౌరీ ఉత్సవాలు నిర్వహించారు.

చిక్కణ్ణేశ్వర ఆలయానికి నాగాభరణం అందజేత

కణేకల్లు : స్థానిక చిక్కణ్ణేశ్వర ఆలయానికి విశ్రాంత ఉపాధ్యాయుడు శేషారెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి శుక్రవారం 2 కిలోల వెండి నాగాభరణాన్ని అందజేశారు. అనంతరం శేషారెడ్డి కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కుటుంబ సభ్యులతో నాగాభరణం అందజేస్తున్న శేషారెడ్డి

విఆర్‌ఎల పే స్కేల్ సాధనకు పోరాడుదాం

ప్రజాశక్తి- కళ్యాణదుర్గం రూరల్

పే స్కేల్ సాధన కోసం పోరాటం చేద్దామని విఆర్‌ఎ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అంజి పిలుపునిచ్చారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం అనిల్ అధ్యక్షతన ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల(విఆర్‌ఎ) సంఘం జనరల్ బాడీ (కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ కమిటీ(సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అంజి, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో విఆర్‌ఎలు చాలీచాలనీ వేతనంతో, ఉద్యోగోన్నతులు లేక నామినీగా ఎన్నో ఏళ్ల నుంచి పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం వెంటనే పే స్కేల్, ఉద్యోగోన్నతులు, నామిని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల అమలుపై రాష్ట్ర నాయకత్వం మంత్రి నారా లోకేష్ బృందంతో సంప్రదింపులు చేస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. అనంతరం వాచ్‌మెన్ పోస్టులు త్వరగా భర్తీ చేయాలని కోరుతూ నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చారు. ఆర్డీవో మాట్లాడుతూ అతి త్వరలోనే ఉద్యోగోన్నతులు ఇస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో కళ్యాణదుర్గం డివిజన్ అధ్యక్షుడు నాగేంద్ర, అనిల్, మహేష్, చిత్తయ్య, తిప్పేస్వామి, పరమేష్, పెద్ద ఆంజనేయులు, అంజి, ఈరన్న, నాగరాజు, నాగలక్ష్మి, రీనా, తదితరులు పాల్గొన్నారు.

'బాలమేధావి' విద్యార్థినికి స్టేట్ థర్డ్ ర్యాంకు

ప్రజాశక్తి-డి.హీరేహాల్

దక్షిణ హిందీ ప్రచారసభ నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో మండలంలోని కళ్లెం గ్రామంలో ఉన్న బాలమేధావి ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని సి.నవ్య రాష్ట్రంలోనే 3వ ర్యాంకు సాధించినట్లు కరస్పాండెంట్ వన్నూరుస్వామి తెలిపారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం అభినందన సభ నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను యాజమాన్యం అభినందించి సన్మానించారు. కరస్పాండెంట్ మాట్లాడుతూ దక్షిణ హిందీ ప్రచారసభ నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో సి.నవ్య రాష్ట్రంలో 3వ ర్యాంకు సాధించగా, మరో 80 మంది విద్యార్థులు మొదటి స్థానంలో పాసయ్యారని తెలిపారు.



విద్యార్థినిని అభినందిస్తున్న యాజమాన్యం

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-పుట్లూరు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతోపాటు ఈదురు గాలులకు మండలంలోని అరకటవేముల గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. 20 రోజుల్లో చేతికి వస్తుందనుకున్న మొక్కజొన్న పంట సుమారు 45 ఎకరాల్లో దెబ్బతిందని అంచనా వేశారు. ఈ సందర్భంగా రేకులకుంట సీనియర్ శాస్త్రవేత్త నారాయణస్వామి మాట్లాడుతూ మొక్కజొన్నలో నిల్వ ఉన్న నీటిని తీసివేసి 48 గంటల తర్వాత హెక్టారుకు ఐదుకిలోల పొటాషియం నైట్రేట్ పిచికారి చేసుకుంటే పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే వర్షం వచ్చిన కారణంగా కత్తెర పురుగు ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రాథమిక నివేదికగా మండలంలో 74 మంది రైతులు 213 హెక్టార్లలో పంటలు నష్టపోయినట్లు అంచనా వేసినట్లు ఎఒ కాత్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్, వ్యవసాయ విస్తరణ అధికారి హరి, విహెచ్ఎ ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని అరకటవేముల, సూరేపల్లి, చింతకుంట, తదితర గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను సిపిఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వర్షాలకు జొన్న, మొక్కజొన్న, అరటి, బొప్పాయి, ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు ఓబుళపతి, బలరాముడు, నారాయణ, బాలకొండయ్య, అన్నయ్య, కుళ్లాయప్ప, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : వర్షానికి తడిసిన ధాన్యం, నేల కొరిగిన వరి పంటను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోదరి బండారు కిన్నెరశ్రీ శుక్రవారం పరిశీలించారు.


యల్లనూరు మండలంలో పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకుంటున్న కిన్నెరశ్రీ


పుట్లూరు మండలంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

ఈ సందర్భంగా పంటలు దెబ్బతిన్న రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత ఏ మేరకు పంట నష్టం జరిగిందో మండల వ్యవసాయ అధికారి రామకృష్ణతో ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ రాజా, ఎంపిడిఒ వాసుదేవరెడ్డి, ఆర్ఐ నారాయణమ్మ, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, మండల కన్వీనర్ దొడ్లో రామాంజనేయులు, రామకృష్ణారెడ్డి, జంగంపల్లి సర్పంచి కుళ్లాయప్పనాయుడు, చింతకాయమంద రాము, దొడ్లో సుబ్బారాయుడు, భైరవేశ్వర్, రైతు భరోసా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండలంలోని వడియంపేట, గోవిందంపల్లి, నీలంపల్లి, కొర్రపాడు, రెడ్డిపల్లి, తదితర గ్రామాల పరిధిలో అకాల వర్షాలకు దెబ్బదిన్న పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.శ్యాంసుందర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చేతికి వచ్చిన పంటలు నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలో దాదాపుగా 50 ఎకరాల వరి పంట దెబ్బతిందన్నారు. ఇందుకు సంబంధించి పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని తెలిపారు.

ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టాలి

తాడిపత్రి రూరల్ : అకాల వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మండల పరిధిలోని వెలమకూరు, తిమ్మాపురం గ్రామాలలో వరి, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున తక్షణమే ప్రభుత్వం గ్రామస్థాయిలోని వ్యవసాయ అధికారులతో పంట నష్టాలను అంచనా వేయించి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

బోగస్ రేషన్‌కార్డులపై దర్యాప్తునకు వినతి

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి హయాంలో మంజూరు చేసిన బోగస్ రేషన్‌కార్డులపై సమగ్ర విచారణ చేపట్టి అనర్హుల కార్డులు తొలగించాలిన ఎపి పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. ఈమేరకు శుక్రవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం మంత్రిని ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రేషన్ పంపిణీలో అవకతవకలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఎండీయూ ఆపరేటర్లు ఉద్దేశపూర్వకంగా ప్రజా పంపిణీ వ్యవస్థను పలుచన చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గతంలో వైసిపి ప్రభుత్వం అనర్హులకు రేషన్‌కార్డులు జారీ చేసిందన్నారు. వీటిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి అర్హులకు కొత్త రేషన్ కార్డులు అందేలా చూడాలని కోరారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బకాయి వేతనాలు చెల్లించాలి

కమిషనర్ ఛాంబర్‌లో కార్మికుల బైఠాయింపు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్‌లో కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. వేతనాలు రాకపోవడంతో ఇంటి బాడుగలు చెల్లించలేక.. పిల్లలకు స్కూల్ ఫీజులు కట్టలేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందుకు కమిషనర్ నాగరాజు స్పందిస్తూ రెండురోజుల్లోగా కార్మికులకు జీతాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేష్, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, కమిటీ సభ్యులు రామాంజి, ప్రభాకర్ పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

రైతుసంఘం మండల కార్యదర్శిగా పి.దేవేంద్రరెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఎపి రైతుసంఘం మండల కార్యదర్శిగా పి.దేవేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు మండల పరిధిలోని తురకపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఎపి రైతుసంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాజారామిరెడ్డి కార్యదర్శితో సభ్యులను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పి.దేవేంద్రరెడ్డి, అధ్యక్షులుగా నరేష్‌యాదవ్, సభ్యులుగా సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగేంద్రయాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న కలెక్టరేట్ ముందు నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో పెద్ద సూర్యుడు, నారాయణరెడ్డి, శ్రీరాములు, పాపిరెడ్డి, వసంతకుమార్, కొండయ్య, నారాయణస్వామి, వసంత్, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


రైతుసంఘం నూతన కమిటీ సభ్యులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

18న మహాధర్నా జయప్రదం చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధార్థ డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 18న విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు రూ.3,480 కోట్ల విడుదలపూ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. ఇందుకోసం బడ్జెట్ కేటాయింపుల్లో నిధులు కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో 84 లక్షల మంది విద్యార్థులకు రూ.12,600 కోట్లు రావాల్సి ఉందన్నారు. కానీ రూ.5,387.03కోట్లే బడ్జెట్‌లో కేటాయించారన్నారు. దీంతో తల్లికి వందనంపై కూడా అనుమానాలు పెరిగాయన్నారు. అలాగే జీఒ 77ను రద్దు చేయాలన్నారు. ఎంతో అర్భాటంగా తీసుకొచ్చిన డిగ్రీ హానర్స్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టళ్లలో మెస్‌ఛార్జీలు పెంచాలని, వర్శిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న విజయవాడ ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉరవకొండ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందు, హిరణ్య, సాయికుమార్, మల్లి, సతీష్, ముజీఫ్, అశోక్, బాబు, బన్నీ, సోము, తదితరులు పాలొగొన్నారు.


ఉరవకొండ మండలంలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంతకల్లు : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న విజయవాడలో జరిగే ధర్నాకు విద్యార్థులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేశ్ పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వైటిసి రమేష్, వెంకటేష్, నాయకులు జాకీర్, బాలాజీ, హేమంత్, భీమేష్, చందు, సాయి, ప్రియ, అపర్ణ, గౌసియా, సానియా పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్ సర్వే తనిఖీ

ప్రజాశక్తి-యల్లనూరు

మండల వ్యాప్తంగా సచివాలయ సిబ్బంది చేపట్టిన జియో టాగింగ్ సర్వేని ఇఒఆర్‌డి మనోహర్‌బాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సిచివాలయ సిబ్బంది చేస్తున్న సర్వేపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సలీం, జెఎల్ఎం ఖలీల్ ఉన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న ఇఒఆర్‌డి మనోహర్‌బాబు

తుంపెర హెచ్చెల్సీ డీప్‌కట్ పరిశీలన

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధి లోని తుంపెర గ్రామ సమీపంలో ఉన్న హెచ్చెల్సీ డీప్ కట్‌ను ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రాంతానికి రావాల్సిన నీరు ఆప్రాంతానికి న్యాయబద్ధంగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులు సమన్వయంతో వ్యవహరించి చివరి అయకట్టు వరకూ నీరు వెళ్లే విధంగా సహకరించాలని కోరారు. ఆయనతోపాటు రైతులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


హెచ్చెల్సీ డీప్‌ను పరిశీలిస్తున్న పరిటాల సునీత

పంపనూరులో కార్తీక పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి-ఆత్మకూరు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని పంపనూరులో వెలసిన సుబ్రమణ్వేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి ఉదయం నుంచి అర్చనలు, పాలాభిషేకం పంచామృతాభిషేకం, బంగారు కవచసేవ అలంకరణ, అర్చన మహానైవేద్యం, మహామంగళహారతి, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. మండల పరిషత్ అధికారి లక్ష్మీనరసింహ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇఒ బాబు, ప్రధాన అర్చకులు రామస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-ఉరవకొండ

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించడంతోపాటు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కూడేరు మండల కేంద్రంలో డిప్యూటీ తహశీల్దార్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు తగ్గించాలని, మహిళలపై దాడులు ఆపాలని, ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలన్నారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు తాము అధికారంలో వస్తే రైతులకు విద్యుత్ మీటర్లను బిగించమని, విద్యుత్ ఛార్జీలు పెంచమని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక అవే అమలుకు పూనుకోవడం బాధాకరమన్నారు. విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, తక్షణమే నిత్యవసరకులు తగ్గించాలన్నారు. ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని, మద్యం పాలసీని సవరణ చేసి, సమయాన్ని కుదించాలని సూపర్‌సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.కరీంసాబ్, నాయకులు పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.


డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పరిశీలన

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

నగరంలోని వివిధ మున్సిపల్ కాంప్లెక్స్‌లను కమిషనర్ నాగరాజు శుక్రవారం పరిశీలించారు. ఇందులో భాగంగా టవర్‌క్లాక్ కాంప్లెక్స్, జూనియర్ కళాశాల కాంప్లెక్స్, పాతూరు కాంప్లెక్స్, సాయినగర్ కాంప్లెక్స్‌లను పరిశ్శీలించి శిథిలావస్థలో ఉన్న దుకాణాలకు మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే అధిక బకాయిలు ఉన్న యజమానుల నుంచి వసూలు చేయాలని సూచించారు. బకాయిల వసూళ్లలో అలసత్వం చూపొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఇఇ షాకీర్, ఆర్వో సతీష్‌కుమార్, డిఇలు, ఎఇలు, ఎసిపి తదితరులు పాల్గొన్నారు.


గదులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగరాజు

ఎన్‌సిడి 3.0 సర్వే వేగవంతం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎన్‌సిడి 3.0 సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని పెద్దకౌకుంట్ల వైద్యాధికారి అనికేథ్ సూచించారు.శుక్రవారం ఉరవకొండ మండలం పెద్ద కొకుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నింబగల్లు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌సిడి 3.0 సర్వేపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ ఈ సర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మధుమేహం, అధిక రక్తపోటు, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లను గుర్తించనున్నట్లు తెలిపారు. ఈ సర్వేలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు సంబంధించిన ఎంఎల్‌హెచ్‌పి, సచివాలయ ఎఎన్ఎం, ఆశా కార్యకర్త ఒక బృందంగా ఏర్పడి ప్రతి ఇంటినీ సందర్శించి వ్యాధులను స్క్రీనింగ్ చేసి గుర్తించనున్నట్లు వివరించారు. అలాగే పొగాకు వాటి ఉత్పత్తులను దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఎంపిహెచ్ఒ గోవిందు, సూపర్‌వైజర్లు చౌడప్ప, నాగరత్న, ఆరోగ్య సహాయకుడు ఎం.ప్రసాద్‌రావు, ఎంఎల్‌హెచ్ పి.మౌనిక, ఆశా కార్యకర్తలు ఉమాదేవి, శాంతకుమారి, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సర్వే తీరును పరిశీలిస్తున్న అధికారులు


జగన్‌తో వంశీగోకుల్‌రెడ్డి కరచాలనం

జగన్‌ను కలిసిన తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

తాడేపల్లిలో క్యాంపు కార్యాలయంలో వైసిపి అధినేత వైఎస్.జగన్‌ను మండల పరిధిలోని తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, కార్యకర్తల బాగోగులపై చర్చించారు. నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులకు ఏ సమస్య వచ్చినా అండగా నిలవాలని జగన్ సూచించినట్లు గోకుల్‌రెడ్డి తెలిపారు.

అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మందులు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని రాజు రోడ్డులో ఉన్న ఆర్యవైశ్య హాస్టల్, వృద్ధాశ్రమంలో శుక్రవారం అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 80 మంది వృద్ధులకు ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వృద్ధులను పిల్లలు తమ వద్ద ఉంచుకుని వారి బాగోగులు చూసుకోవాలని కోరారు. వృద్ధులకు అవసరమైన మందులను పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ మాట్లాడుతూ వద్ధులకు ఏమైనా అవసరమైతే తప్పకుండా నేను సహాయం చేస్తానన్నారు. అనంతరం నలుగురు వృద్ధులకు ఇయర్ రింగ్ సమస్య ఉండగా, వారికి డాక్టర్ తో పరిశీలించి ఇయర్ రింగ్ మిషన్‌లను త్వరలో అందజేస్తామన్నాని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వృద్ధుల అధ్యక్షులు నాగభూషణం, వృద్ధాశ్రమ సభ్యులు వెంకటేష్ బాబు, సత్యారామ్, శివ రామాంజనేయులు, శంకరప్ప, కృష్ణమూర్తి, మల్లికార్జున జ్యోతి, మనోజ్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అధిక మోతాదులో యాంటీబయోటిక్స్ ప్రమాదకరం

డిఎంహెచ్ఒ ఇబి.దేవి

ప్రజాశక్తి-అనంతపురం


వైరాతాదుకు మించి యాంటీబయోటిక్స్ వాడటం ప్రమాదకరమని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి.దేవి సూచించారు. జాతీయ నవజాతా శిశు సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం నగరంలోని పెద్దాసుపత్రి సర్జికల్ విభాగంలోని సెమినార్ హాలులో డిఎంహెచ్ఒ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 21వ తేదీ వరకూ జిల్లావ్యాప్తంగా నవజాతా శిశువుల సంరక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించన్నుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్‌కుమార్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త పాల్ రవికుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, ఆర్ఎంఒలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, చిన్నపిల్లల విభాగం అధికారి డాక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ ఇబి.దేవి

జాబ్‌మేళాలో 22 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రుద్రంపేటలో ఉన్న శ్రీబాలాజీ ఎంబిఎ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు. ఓ బహుళ జాతీయ కంపెనీ నిర్వహించిన రాత పరీక్ష, బృంద చర్చలు, మౌఖిక ఇంటర్వ్యూల్లో సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొనగా 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల ఛైర్మన్ పల్లె కృష్ణకిషోర్ మాట్లాడుతూ కళాశాలలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతోనే పని చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కూడా మరింత సాంకేతికతను పెంపొందించుకోవాలని సూచించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు బెంగళూరు కేంద్రంగా రూ.2.5లక్షల వార్షిక వేతనంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ ప్రిన్సిపాల్ యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ కంపెనీ మానవనుల అధికారి బి.ఆర్ రఘురాజు, ప్రాంగణ నియామకాల అధికారి బాబా ఫక్రుద్దీన్, డాక్టర్ వాయిదా శివకుమార్, విభాగాధిపతి సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని తాగు, సాగునీటి సమస్యపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అసెంబ్లీలో ప్రస్తావించడంతో మండల టిడిపి నాయకులు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. గండికోట రిజర్వాయర్ నుంచి పుట్లూరు మీదుగా సుబ్బరాయుడు సాగర్‌కు పైప్‌లైన్ ద్వారా నీరు విడుదల చేయించాలని శాసనసభలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ విన్నవించింది. దీంతో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, పుట్లూరు పుల్లారెడ్డి బాలాపురం రామచంద్రారెడ్డి, గోపరాసుపల్లి రవికుమార్‌రెడ్డి, ఎల్కే చెన్నారెడ్డి, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

బిసి సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



యల్లనూరు : వెనుకబడిన కులాలు, తెగల వారికి బిసి కార్పొరేషన్, సహకార సంఘం ద్వారా అందించే సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ వాసుదేవరెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా బిసి (ఎ.డి)లు బిసి కార్పొరేషన్ అందించే పథకాలకు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రూపు సంఘాలు ఏర్పాటు చేసుకుని లబ్ధి పొందవచ్చని తెలిపారు.

చెట్టు పైనుంచి జారిపడ్డ బాలుడు.. పరిస్థితి విషమం

ప్రజాశక్తి-కణేకల్లు

స్థానిక తారకరామనగర్‌కు చెందిన బాలుడు ఇర్ఫాన్‌బాషా శుక్రవారం రేగిచెట్టుపై నుంచి జారి కిందపడటంతో అతని వీపు భాగంలో ఓ కర్ర లోపలికి దూసుకెళ్లింది. వివరాలు.. ఇర్ఫాన్‌బాషా స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఆరో తరగతి చెబుతున్నాడు. శుక్రవారం పాఠశాలకు ఆప్షన్ సెలవు కావడంతో స్నేహితులతో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉన్న రేగిచెట్టు ఎక్కి కొన్ని కాయలు కోశాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ కాలు జారి కింద పడడంతో పదునైన ఓ కొయ్య అతడి పొట్టలోకి దూసుకెళ్లి వీపు భాగంలో బయటకు వచ్చింది. స్థానికులు గమనించి ఇర్ఫాన్‌బాషాను ప్రభుత్వా సుపత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తీసుకెళ్లారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

రైల్వే డబుల్ లైన్‌కు భూముల పరిశీలన

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి-పెండేకల్లు మధ్య రైల్వే డబుల్ లైన్ పనుల కోసం కేటాయించిన భూములను జిల్లా సంయుక్త కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ శుక్రవారం పరిశీలించారు. ప్రత్యేక రైల్వే ప్రాజెక్టు కింద చేపడుతున్న డబుల్ లైన్ పనుల కోసం చెట్నేపల్లి గ్రామ పరిధిలో ఉన్న పొలాల్లోని భూములను సేకరించారు. తర్వాత అహుడా కేటాయించిన స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట తహసిల్దార్ దాసరి ఓబిలేసు, రైల్వే సెక్షన్ అధికారి విమలేష్ కుమార్, సర్వేయర్ శేషసాయి, గ్రామ రెవెన్యూ అధికారులు టి.సురేంద్ర, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న జెసి శివ్‌నారాయణ్‌శర్మ

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

అనంతపురం క్రైం : ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక 4వ పట్టణ సీఐ కె.సాయినాథ్ తెలిపారు. వివరాల మేరకు సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోటకు చెందిన భూపతి స్థానిక రామచంద్రనగర్‌లో ఒక పల్సర్ బైక్, కళ్యాణదుర్గం బైపాస్ సమీపంలో రాయల్ బుల్లెట్ దొంగిలించాడు. వాటిని అమ్మడానికి స్థానిక చంద్రబాబు కొట్టాల వద్ద ఉండగా ఎస్ఐ రాంప్రసాద్, సిబ్బంది శివయ్య, రవి, రామాంజనేయులు, మహేష్ తో కలిసి అరెస్టు చేసి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. నిందితుడు గతంలో కూడా దొంగతనాలు చేసి జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు.


దొంగ వివరాలను వెల్లడిస్తున్న సిఐ కె.సాయినాథ్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి : మండల పరిధిలోని ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుత్తి మండలం టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సందీప్ తన తండ్రి కేశవతో కలిసి గుత్తి పట్టణంలో పని నిమిత్తం వచ్చారు. గుత్తిలో పని ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. అయితే ఎంగిలిబండ గ్రామ శివారులో వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనంలో వెనుక వైపు కూర్చున్న సందీప్ అదుపు తప్పి బైక్ నుంచి రోడ్డు పై పడ్డాడు. బైక్ నుంచి పడిన సమయంలో వెనుక నుంచి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బైక్ నుంచి సందీప్ కింద పడ్డం చూసిన అక్కడి స్థానికులు కేకలు వేయడంతో గమనించిన తండ్రి కేశవ బైక్‌ను రోడ్డు పక్కకు వాహనాన్ని నిలిపాడు. అనంతరం తీవ్రంగా గాయపడిన సందీప్ ను వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పూజలు చేస్తున్న ఎంపీ అంబికా

గురునానక్ మందిరంలో ఎంపీ పూజలు

అనంతపురం రూరల్ : నగరం లోని శ్రీకంఠం సర్కిల్ దగ్గర ఉన్న గురునానక్ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గురునానక్ బోధనలను గుర్తు చేసుకున్నారు. ఆయన బోధనలు సత్యం, ధర్మం, ప్రేమపై నిలదొక్కుకునేలా ప్రేరణ ఇస్తాయన్నారు. ఈ వేడుకల్లో గురునానక్ సంఘం సభ్యులు సుందర్‌సింగ్, గోవింద్‌సింగ్, అర్జున్‌సింగ్, శేఖర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

గార్లదిన్నె : పెన్నానది పరీవాహక ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఈరమ్మ, ఎస్ఐ గౌస్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని కేశవాపురం, కొప్పలకొండ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి సొంత పనులు కాకుండా ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎడిఎ కార్యాలయం ఆధునీకరణకు ప్రతిపాదనలు పంపండి

అనంతపురం : అనంతపురం వ్యవసాయం డివిజన్ కార్యాలయం ఆధునీకరణకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని జెడిఎ ఉమామహేశ్వరమ్మకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. గురువారం నగరంలోని ఎడిఎ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడం గమనించి ఆధునీకరణ చేసేందుకు అవసరమైన సౌకర్యాలపై ప్రతిపాదనలు తయారు చేసి సూచించారు. మరమ్మతులు పూర్తయి ఐఎస్ఓ సర్టిఫికెట్ సాధించాలని సూచించారు.

స్కేటింగ్ ఉచిత శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

స్కేటింగ్ నేర్చుకోవాలి అనుకున్న వారికి ఈనెల 16 నుంచి జనవరి 12వ తేదీ వరకూ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కోచ్‌లు అఖిల్, నరసింహారాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ మార్గ్, భవానీనగర్ దగ్గరలో లక్కీ రోలర్ స్కేటింగ్ అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 93465 08576, 93989 71578ను సంప్రదించాలని కోరారు.

పూడికతీతపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని కాలువల్లో పూడికతీతపై ప్రత్యేక దృష్టి సారించాలని మేయర్ మహమ్మద్‌వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని పలుప్రాంతాల్లో మేయర్ పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీత చేపట్టకపోవడం వల్ల నిన్న కురిసిన వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో నివాసాలలోకి నీరు చేరిందని భవిష్యత్ లో ఇలాంటివి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అదే విధంగా కాలువలలో వ్యర్థాలు తొలగించాలని ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువలలో వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్ కమల్ భూషణ్, ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యం పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం



మురికి కాలువల్లో బ్లీచింగ్ చల్లుతున్న వైద్యసిబ్బంది

సీజనల్ వ్యాధులను అరికడదాం

ప్రభుత్వ వైద్యాధికారి రాజేంద్ర

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతిఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించి సీజనల్ వ్యాధులను అరికడదామని విడపనకల్ ప్రభుత్వ వైద్యాధికారి రాజేంద్ర పిలుపునిచ్చారు. కడ్లే గౌరమ్మ రథోత్సవ వేడుకలను పురస్కరించుకుని విడపనకల్లు మండల కేంద్రంలో సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహించి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుంచి సోమవారం వరకూ జరిగే గౌరమ్మ రథోత్సవ వేడుకలకు పెద్దఎత్తున ప్రజలు పాల్గొంటారన్నారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో మురుగునీటి కాలువలు, డ్రైయినేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బోయ చంద్రశేఖర్, పంచాయతీ సెక్రటరీ మహబూబ్‌బాషా, ఇఒఆర్‌డి సత్యబాబు, డిప్యూటీ తహశీల్దార్ ప్రసాద్, మలేరియా, సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జైసీతారామ్‌కు నివాళులర్పిస్తున్న సాహితీమిత్ర ప్రతినిధులు

కోగిర జైసీతారామ్‌కు నివాళి


ప్రజాశక్తి-అనంతపురం

కవికాకి కోగిర జై సీతారామ్ శత జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో సాహితీమిత్ర సంస్థల ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ కవి, విరసం మాజీ సభ్యులు జెట్టి జయరామ్, తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు టివి.రెడ్డి, విశాలాంధ్ర బుక్‌హౌస్ విశ్రాంత మేనేజర్ జయరాములు మాట్లాడుతూ 1971 నవంబర్ 14న దిగంబర కవుల సమక్షంలో జరిగిన కవి సమ్మేళనంలో జై సీతారామ్ చదివిన కవితను శ్రీ శ్రీ మెచ్చుకుంటూ అభినందించారన్నారు. ఆయన రచించిన అక్షర సైన్యం పుస్తకాన్ని అప్పట్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేను ఆవిష్కరించానని జెట్టి జయరామ్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా నాయకులు కేఎల్‌ఎం ప్రసాద్, టిఎన్.రసూల్, విశాలాంధ్ర సిబ్బంది సి.శ్రీనివాసులు, హరీష్, మస్తానప్ప, తదితరులు పాల్గొన్నారు.

బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కుళ్లాయప్పకు సన్మానం

ప్రజాశక్తి-నార్పల

బిసి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన బండ్లపల్లి గ్రామానికి చెందిన కుళ్లాయప్పను టిడిపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కుల్లాయప్ప మాట్లాడుతూ తనను బిసి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టిడిపి నాయకులు జిల్లా ఆలం వెంకట నరసానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆలం నాగార్జున, పిట్టు రంగారెడ్డి, గూగుడు జాఫర్, పిఎల్ లక్ష్మీనారాయణ, విజయ్ కన్వీనర్ ఎర్రనాగప్ప, తెలుగుయువత నాయకులు చంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.



కుళ్లాయప్పను సన్మానిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-నార్పల

57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామాజిక సేవా కార్యకర్త కెఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ పుస్తకం మంచి నేస్తం అన్నారు. కావున ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచే పుస్తకాలను చదివే అలవాటు అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి జీవన, లక్ష్మీనారాయణ వెంకటేష్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పుస్తక పఠనంతో ప్రతిఒక్కరూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని ఉరవకొండ గ్రంథాలయ అధికారి ప్రతాపరెడ్డి సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెద్దవడుగూరు శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గ్రంథాలయ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 'చొక్కనైనా తొడుక్కో ఒక మంచిపుస్తకం కొనుక్కో' అని ఒకంచి మాటతో పుస్తకం విలువను, ఆవశ్యకతను గురించి పుస్తకం ఒక మంచినేస్తం వీటిని చదివే అలవాటు చిన్నప్పటి నుంచే అలవర్చుకోవాలన్నారు. నేటిచరిత్ర భావితరాలకు అందించే ఒక మంచి అద్భుతమైన రూపం అన్నారు.



నార్పలలో పుస్తకాలు చదువుతున్న పాఠకులు, విద్యార్థులు

రైల్వే కార్మికులకు మజ్దూర్ యూనియన్ అండ

ప్రజాశక్తి-గుత్తి

రైల్వే కార్మికులకు దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అండగా ఉంటుందని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సిహెచ్.శంకరరావు అన్నారు. వచ్చే నెల 4, 5, 6వ తేదీల్లో రైల్వే కార్మిక సంఘాల ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే యూనియన్ ఆధ్వర్యంలో గుత్తిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముందుగా పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి యూనియన్ నాయకులు, కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఎండబ్ల్యూ డిపో, కంట్రోలర్ లాబీలో కామ్రేడ్ సిహెచ్.శంకరరావు డివిజనల్ కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి శర్మ, ఏడిఎస్ నారాయణలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శేఖర్ బాబు, రామంజనేయులు రెడ్డి, మనోహర్ శేఖర్, బాబు నరసింహా, సుధీర్, రైల్వే పెన్షనర్ల సంఘం కార్యదర్శి మస్తాన్ వలి, కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు కృతజ్ఞతలు

అనంతపురం రూరల్ : నగరంలోని ఆర్‌కె.నగర్‌లో కల్వర్ట్ నిర్మించడంపై స్థానికులు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ కల్వర్ట్‌ను నిర్మించాలని గత పాలకుల దగ్గర ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. ఈ మధ్యకాలంలో ఎమ్మెల్యే నిర్వహించిన 'మీ ఇంటికి-మీ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా కల్వర్ట్ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే స్పందించి కల్వర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారన్నారు. ఇందుకు ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని తెలిపారు.

రాయలసీమలో న్యాయ రాజధాని ఏర్పాటు చేయాలి

వైసిపి ఐటి జిల్లా అధ్యక్షులు వై.రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం న్యాయ రాజధానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలని వైసిపి ఐటి జిల్లా అధ్యక్షులు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అనంతపురంలోని మార్కెట్ యార్డు వద్ద భారత్ ప్రజారైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహినంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటు చేసి వెయ్యికోట్లతో హైకోర్టు నేషనల్ లా యూనివర్సిటీని ప్రారంభించి పనులు మొదలు పెట్టారన్నారు. అయితే కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం తిరిగి న్యాయ రాజధానిని అమరావతిలో పెట్టే ప్రయత్నాలు చేయడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రాయలసీమకు న్యాయ రాజధాని కేటాయించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత్ ప్రజారైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, గోపాల్, శ్రీనివాసులు, శివారెడ్డి, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



రాయలసీమ నినాదాలు చేస్తున్న నాయకులు